క్లుప్తంగా

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్ శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

ముదిగొండ: ఖమ్మం వల్లభి రోడ్డు నిర్మాణంలో భాగంగా రోడ్డు నిర్మాణం రోడ్డుకు ఒక వైపే భవనాలు కూల గొడుతున్నారని ఆర్‌అండ్‌బీ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించి 50 అడుగులు తీసి నష్టం కలిగిస్తున్నారని గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ శిరీషకు వినతిపత్రం ఇచ్చారు. 40 సంవత్సరాల క్రితం కట్టుకున్న ఇళ్లను కూడా కూల్చి వేయడం దుర్మార్గమన్నారు. వల్లభి నుంచి బాణాపురం, అయ్యగారి పల్లె, కమలాపురం, వనం వారి కృష్ణాపురం, చిరుమర్రి, న్యూ లక్ష్మీపురం, ముదిగొండ గ్రామాలలో ఒక వైపు మాత్రమే ఇండ్లు తొలగించాలని ఆర్‌అండ్‌బీ అధికారులు నోటీసులు జారీ చేయడం దారుణమన్నారు. ఈ మేరకు ఎంపీడీఓ శ్రీనివాసరావు, కార్యదర్శి సంపత్‌లకు ఆయా గ్రామాలకు చెందిన వారు వినతి పత్రం ఇచ్చారు.

గీతా మందిరంలో గోదాదేవికి సారె వేడుక



గోదాదేవి సారె వేడుకలో పసుపుకొమ్ములు దంచుతున్న భక్తులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీగీతా జ్ఞానమందిరంలో గల శ్రీపార్థసారధిస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గోదాదేవికి సారె ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలతో ఊరేగింపుగా కోలాట బృందాలతో కలిసి సారె వేడుకలు నిర్వహించారు. పసుపు కొమ్ములు దంచుతూ ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్రవచన కర్త శ్రీరామన్ రామకృష్ణమాచార్యులు, ఏవి శేషాచార్యులు, గుడివాడ వెంకటేశ్వరరావు, తిరునగరి వెంకటనర్సయ్య, బాల లీలాకృష్ణ, మురహరి, కోరుకొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం వితరణ

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లిలో గుగులోత్ జుమాని మృతి చెందడంతో ఆమె కుటుంబానికి కాంగ్రెస్ టీపీసీసీ సభ్యుడు మాళోత్ రాందాసునాయక్ 50కేజీల బియ్యంను శుక్రవారం వితరణ చేశారు. రాందాస్ నాయక్ అందజేసిన బియాన్ని కారేపల్లి సొసైటీ డైరెక్టర్ భానోత్ హీరాలాల్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు మేదరి వీరప్రతాప్ (టోనీ)లు మృతురాలి కుమారుడు గుగులోత్ రత్నాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జానీ, షబ్బీర్, బోడా సీత్రాం, పొడుగు రమేష్, గుగులోత్ రాంసింగ్, మాజీ సర్పంచ్ కొమ్ము వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రూ. కోటి మంజూరు.. గ్రామస్తులు హర్షం

కల్లూరు: మండలంలోని తూర్పులోకవరం పంచాయతీ అభివృద్ధికి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కృషితో రూ.కోటి మంజూరు కావడంతో గ్రామస్తులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగేంద్ర, నాయకులు సామేలు, ఖమ్మంపాటి మోహన్‌రావు, అప్పారావు, నరేష్, లక్ష్మీనారాయణ, పుల్లయ్య, శ్రీను, వార్డు సభ్యులు ఉన్నారు.

క్రికెట్ పోటీల్లో ప్రెస్ జట్టు విజయం

కారేపల్లి: కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో కారేపల్లి మీడియా జట్టు, పొలిటికల్ పార్టీస్ జట్టుతో శుక్రవారం నిర్వహించిన ఫ్రెండ్షిప్ మ్యాచ్‌లో ప్రెస్ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పొలిటికల్ జట్టు నిర్దేశిత 8 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి, 54 పరుగులు చేయగా, ప్రెస్ జట్టు మరో రెండు ఓవర్లు మిగిలి ఉండగానే కేవలం ఒక వికెట్టు కోల్పోయి విజయం సాధించింది. పొలిటికల్ పార్టీస్ జట్టులో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, నాయకులు వీరన్న, వెంకటేశ్వర్లు, కల్యాణ్, రాము, సర్పంచ్ కుమార్, ఎర్రబెల్లి రఘు, ప్రెస్ జట్టులో శ్రీనివాస్, శ్రీనివాసరావు, సీహెచ్.ప్రవీణ్, బాలు, వి.సత్యనారాయణ, పి.నాగేశ్వరరావు, అశోక్, కల్యాణ్, శంకర్, కె.వెంకటేశ్వర్లు, కె.ప్రసాద్, ఆర్.శ్రీనివాస్, జి.శ్రీనివాస్, ఎ.నాగరాజు, ముక్కా వెంకటేశ్వర్లు, భయ్యా నాగేశ్వరరావు, రాధాగోవిందు తదితరులు పాల్గొన్నారు.



విజయోత్సాహంతో కారేపల్లి ప్రెస్ జట్టు

సంక్రాంతి వచ్చిందే తుమ్మెదా..

- పల్లెలకు బయలుదేరిన పట్టణాలు
- కిటకిటలాడుతున్న బస్టాండ్లు
- సెలవులతో ఇంటిబాట పట్టిన విద్యార్థులు
- పిండివంటలతో మహిళలు బిజీబిజీ



పిండి వంటలు చేస్తున్న మహిళలు



మిల్లు వద్ద వేచి ఉన్న మహిళలు

సంక్రాంతి పండుగ అంటే మూడు రోజులు ముచ్చటైన పండుగ, రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ పండుగను అంబరాన్నంటేలా నిర్వహిస్తారు. పట్టణాల్లో ఉండే పల్లె వాసులంతా తమ స్వస్థలాలకు పయనం అవుతుంటారు. కావున అన్ని మండలాల్లో పండుగ సందడి కనిపిస్తున్నది.

మధిర : ఖమ్మం జిల్లా ఆంధ్రా సరిహద్దు ప్రాంతంలో ఉండటంతో సంక్రాంతి సంబరాలు ఇక్కడ కూడా ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా ఈ ప్రాంతానికిచెందిన ప్రజలకు ఆంధ్రాప్రాంతంవారితో సత్సంబంధాలు కలిగి ఉండటంతో ఇక్కడవారు ఆంధ్రా సంస్కృతి, సాంప్రదాయాలు పాటిస్తుంటారు. తెలుగువారికి అతిపెద్ద పండుగ అయిన సంక్రాంతిని ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. ఈ నెల15న సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు వంటకాలతో బీజీబీజీగా ఉన్నారు. పండుగకు పిండివంటలు చేస్తున్నారు. మరికొంతమంది వివిధ రకాల పప్పులను తీసుకెళ్లి పిండిమిల్లుల్లో మర పట్టిస్తున్నారు. దీంతో పిండిమిల్లులవద్ద రద్దీగా ఉంది. ఈ పండుగకు అరిసెలు, సకినాలు, చక్రాలు, చెక్కగారెలు, లడ్డూలు, పప్పుచెక్క, కారప్పూస తదితర వంటలు తయారుచేస్తుంటారు. ముఖ్యంగా గ్రామీణప్రాంతాల్లో నువ్వుల అరిసెలు తయారుచేయడం ఈ పండుగకు ఆనవాయితీ. నలుగురైదుగురు మహిళలు కలిసి పిండివంటలు తయారుచేస్తుంటారు. దీతో గ్రామాల్లో పండుగ వాతావరణం స్పష్టంగా కనిపిస్తుంది. గతంలో పిండి కొట్టేందుకు కుందులు ఉండేవి. ప్రస్తుతం కుందులు లేకపోవడం, రోకలి పోటుతో పిండిని కొట్టేవారులేక రోకళ్ల చప్పుళ్లు కనుమరుగయ్యాయి. ఎక్కువమంది ప్రజలు పిండి మిల్లులనే ఆశ్రయిస్తున్నారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో సుదూరప్రాంతాల్లోని పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఇళ్లకు చేరుకుంటున్నారు. అదేవిధంగా పలుచోట్ల ఉద్యోగ, వ్యాపారాలుచేస్తూ స్థిరపడినవారు పండుగకు స్వస్థలాలకు చేరుకుంటున్నారు. బంధుమిత్రులకోసం, కూతుళ్లు, అల్లుళ్లకు దుస్తులు కొనుగోలుచేసేందుకు ఆయా దుకాణాలకు వెళడంతో అక్కడ పండగ వాతావరణం సంతరించుకుంది. పతంగులను ఎగురవేసేందుకు పిల్లలు ఉత్సాహంగా ఉన్నారు. ఆయా గ్రామాల్లో పెద్దలు కబడ్డీ, క్రికెట్, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఆంధ్రాలో జరగబోయే కోడిపందేలను తిలకించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నెల 14నుంచి ఆంధ్రాలోని నారికంపాడు, ధర్మాజీగూడెం, ఏలూరు, హనుమాన్ జంక్షన్, కాకర్ల, భీమవరం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ ప్రాంత స్నేహితులు ప్రణాళిక సిద్ధంచేసుకున్నారు. హరిదాసు కీర్తనలు మొదలయ్యాయి. వివిధ ప్రాంతాల్లో ఉన్న గంగిరెద్దులవాళ్లు పండుగకు సిద్ధంగా ఉన్నారు.

22 సంవత్సరాలుగా ముగ్గుల పోటీలు



మధిర సేవా సమితి ఆధ్వర్యంలో గత 22 సంవత్సరాలుగా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నాము. మధిర పట్టణంలోని ఆజాద్ రోడ్డులో జరిగే ఈ పోటీలో వందలాదిమంది మహిళలు ఉత్సాహంగా పాల్గొంటారు. ముగ్గుల పోటీలో పాల్గొనే ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతితో పాటు విజేతలకు మంచి బహుమతులు అందజేస్తాం. ఈ ముగ్గులను తిలకించేందుకు ఎంతోమంది వస్తుంటారు. ప్రజల రాకపోకలతో పండుగ వాతావరణం స్పష్టంగా కనిపిస్తుంది.

– పల్లపోతు ప్రసాదరావు, అధ్యక్షుడు, మధిర సేవా సమితి

బీఆర్‌ఎస్ బహిరంగ సభకు తరలి వెళ్దాం



ముదిగొండ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్



చింతకాని: మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

ముదిగొండ: ఈ నెల 18న ఖమ్మంలో సీఎం కేసీఆర్ సారథ్యంలో నిర్వహించే బీఆర్‌ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, మండల ఇన్‌చార్జి అరూరి రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని వనంవారి కిష్టాపురంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తున్నారన్నారు. ఈ సభకు వేలాదిగా కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండ స్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వాచేపల్లి లక్ష్మారెడ్డి, గడ్డం వెంకట్‌గౌడ్, నాయకులు వెంకన్న, మల్లయ్య, వీరారెడ్డి,అనంతరాములు, వాసూ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చింతకాని/బోనకల్: బీఆర్‌ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తెలిపారు. చింతకాని మండలంలోని రామకృష్ణాపురం, బస్వాపురం, జగన్నాథపురం గ్రామాల్లో, బోనకల్‌లోని బ్రాహ్మణపల్లి, బోనకల్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సీఎం బహిరంగ సభకు భారీగా జనసమీకరణ చేయాలని సూచించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు. ఈ సమావేశంలో ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, వైస్ ఎంపీపీ హనుమంతురావు, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు రమేష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్రామయ్య, నాయకులు లచ్చయ్య, రవీందర్ రెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాస్, రామారావు, చలమయ్య, ఖాసీం సాహెబ్, రామకృష్ణాపురం గ్రామసర్పంచ్ కుటుంబరావు, ఉపసర్పంచ్ నిర్మల, కొండ, సుదాకర్‌రావు, శ్రీను, ప్రసాద్, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: సీఎం బహిరంగ సభకు తల్లాడ మడలం నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లాలని తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు పేర్కొన్నారు. తల్లాడ మండలం వెంగన్నపేట, అంజనాపురం, రగంబంజర, మల్సూర్‌తండా, రంగంబంజర గ్రామాల్లో శుక్రవారం జరిగిన బీఆర్ఎస్ ఆవిర్భావ సభ సన్నాహక సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో రైతు బంధు మండల కన్వీనర్ వెంకట్‌లాల్, వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డి.భద్రరాజు, నూతనకల్ సర్పంచ్ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాసరావు, కేతినేని చలపతిరావు, ఎక్కిరాల సుదర్శన్, బాబు, లింగయ్య, బాణోత్ మోహన్ పాల్గొన్నారు.


ముగిసిన ఉపాధి హామీ ఓపెన్ ఫోరం



ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్న అధికారులు

కొణిజర్ల: మండలంలోని 27 పంచాయతీలలో నిర్వహించిన ఉపాధిహామీ పథకం పనులపై గత వారం రోజులుగా నిర్వహించిన సామాజిక తనిఖీపై గురు, శుక్రవారాల్లో నిర్వహించిన ఓపెన్ ఫోరం ముగిసింది. 2019 నుంచి 2022 వరకు సుమారు 3 ఏండ్ల కాల పరిమితికి సంబంధించిన పనులపై రెండు రోజుల పాటు ఓపెన్ ఫోరం నిర్వహించారు. గురువారం 12 పంచాయతీలకు సంబంధించిన రికార్డులు పరిశీలించగా శుక్రవారం మిగిలిన 15 పంచాయతీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అన్ని పంచాయతీలలో జాబ్ కార్డులు నింపలేదని, పని ప్రదేశానికి సంబంధించిన ఫొటోలు అప్‌లోడ్ చేయలేదని, వర్క్‌షీట్లు నింపడం కూడా తెలియదని తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. పెద్దగోపతిలో పనులు చేయకుండానే బిల్లులు చేసుకున్నారని తెలిపారు. కొణిజర్ల పనులు చేయని వారికి కూడా మస్టర్లు వేశారని ఆరోపించారు. దీనిపై సదరు వ్యక్తులు ఓపెన్ ఫోరం వద్దకు వచ్చి తామే పని చేశామని తమకే బిల్లులు చెల్లించారని తెలిపారు. అనంతరం మండల వ్యాప్తంగా వివిధ పనులకు సంబంధించి రూ.4,40,216 రికవరీ చేయాల్సి ఉందని ఏపీడీ శిరీష తెలిపారు. దీనిపై పీడీ సమక్షంలో నిర్వహించే సమీక్షకు సంబంధిత వ్యక్తులు హాజరై తమ వాదనలు వినిపించుకోవచ్చన్నారు. వారంలోగా పెండింగ్ ఫైల్ వర్క్ మొత్తం పూర్తి చేయకపోతే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సూపరింటెండెంట్ రమణశేఖర్, అంబుడ్స్‌మెన్ రమేష్‌బాబు, ఎంపీడీఓ ఆర్ రమాదేవి, ఎంపీఓ పి.ప్రభాకర్‌రెడ్డి, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీలు రమేష్, వెంకన్న, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



పూర్వ విద్యార్థులతో ఆనాటి గురువులు

తల్లాడ: మండలంలోని రెడ్డిగూడెం జేసు హృదయ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2006 – 2007 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన ఈ విద్యార్థులు కలుసుకొని ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా వారి విద్యాబుద్ధులు నేర్పిన గురువలు రామక్రిష్ణ, శౌరీ, ప్రసాద్, పాపారావు, స్వామిదాస్, అంకంరాజులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి గోపాల్‌రావు, ఉదయ్‌రాజ్, ప్రభాకర్, కిషోర్, చంటి, రమ పాల్గొన్నారు.

ఆశ్రమానికి దుస్తులు అందజేత

మధిర: పట్టణంలోని అర్కే ఫౌండేషన్ అనాథాశ్రమంలోని వృద్ధులకు లంకాసేవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు లంకా కొండయ్య, సతీమణి సంధ్య శుక్రవారం దుస్తులను అందించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు లంకాసేవ ఫౌండేషన్ సేవలను కొనియాడారు.

ఆర్టీసీని ఆదరించండి



కళారూపాలను ప్రదర్శిస్తున్న కళాకారులు

కారేపల్లి: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతున్న ఆర్టీసీని ఆదరించాలని కళాకారులు కళారూపాల ద్వారా ప్రదర్శన నిర్వహించారు. శుక్రవారం కారేపల్లి మండలం కారేపల్లి క్రాసురోడ్డులో టీఎస్ ఆర్టీసీపై ఆర్.సాంబయ్య నేతృత్వంలో కళా ప్రదర్శన నిర్వహించారు. కళాకారులు చేసిన పాటలు, నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. 20రోజుల చార్జీ మాత్రమే చెల్లించి30రోజుల ప్రయాణి చేయవచ్చన్నారు. వివాహాది శుభ కార్యాలకు, యాత్రలకు ఈ బస్సులను తక్కువ ధరకే అద్దెకు ఇవ్వడం జరుగుతందన్నారు. ప్రైవేట్ ప్రమాదాలకు నెలవుగా ఉందని, ఆర్టీసీలో ప్రయాణం ఎంతో సుఖవంతం, సురక్షితమంటూ వివరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు టి.శంకర్, టి.రాజు, వి.ఎల్లస్వామి, బి.కుమార్, డి.శ్రీనివాస్, రమేష్, టి.శ్రీనివాస్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ సభలకు తరలిన ఉపాధ్యాయులు



మహాసభకు తరలివెళ్తున్న మధిర డివిజన్ ఉపాధ్యాయులు

మధిర: రంగారెడ్డి జిల్లాలో జరగనున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలకు మధిర డివిజన్ ఉపాధ్యాయులు తరలివెళ్లారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా పూర్వ కార్యదర్శులు తాళ్లూరి ఆంజనేయులు, లక్ష్మణరావు జెండా ఊపి బస్సును ప్రారంభించారు. సభకు వెళ్లిన వారిలో సంఘం జిల్లా కార్యదర్శి షేక్ నాగుర్ వలీ, మధిర డివిజన్ నాయకులు వినోద్, బండారు నాగరాజు, అనుమోలు కోటేశ్వరరావు, రామకృష్ణ, కస్తూరిబాయి, భీమశంకర్‌రావు, లాల్ అహ్మద్, హసీనా బేగం, అనితాదేవి, నిర్మల, కొండలరావు, భాస్కరరావు, సాంబయ్య, వెంకటేశ్వరరావు, స్వర్గం శ్రీనివాసరావు, కృష్ణయ్య, చెన్నయ్య, రమేష్, రామ్‌సింగ్, మహేంద్ర కుమార్, రాజేష్, చిన్ని, రాము, పుల్లారావు, నర్సింహారావు, అన్సారి, గోపాలరావు, చంద్రప్రసాద్, శ్రీనివాస్, కోటయ్య, మురళీ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ సభ ఖమ్మంలో జరగడం అదృష్టం..

- 50వేలకు తగ్గకుండా తరలిరావాలి..
- సన్నాహక సమావేశాల్లో మంత్రి హరీశ్‌రావు



సత్తుపల్లి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే సండ్ర, వేదికపై మంత్రి హరీశ్‌రావు, ఎంపీలు తదితరులు



వైరా : మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎమ్మెల్యే రాములునాయక్ తదితరులు

సత్తుపల్లి: బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభ ఖమ్మంలో జరగడం అదృష్టం.. వరినాట్లు ఉన్నా.. సంక్రాంతి పండుగ ఉన్నా.. కోడి పందాలు జరిగినా బీఆర్‌ఎస్ సభ తర్వాత చేసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సూచించారు. సత్తుపల్లిలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అధ్యక్షతన శుక్రవారం జరిగిన బీఆర్‌ఎస్ సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి 50వేలకు తగ్గకుండా ప్రజలను తరలించాలని తెలిపారు. బీఆర్‌ఎస్ సభ కరీంనగర్ సింహగర్జనలా అక్కడే పెట్టాలని నేతలు కోరినా... సీఎం కేసీఆర్ మాత్రం ఖమ్మంలో జాతీయ నేతలతో ఏర్పాటు చేయాలని నిర్ణయించారని చెప్పారు. సీపీఎం, సీపీఐ జాతీయ నేతలు కూడా హాజరవుతున్నందున ఆ పార్టీ కార్యకర్తలు వస్తే సభకు తీసుకురావాలని సూచించారు. అనంతరం ఎంపీ బండి పార్థసారధిరెడ్డి మాట్లాడుతూ సత్తుపల్లి, సీఎం కేసీఆర్‌కు గౌరవం తెచ్చేలా తన పనితీరు ఉంటుందని అన్నారు. సత్తుపల్లిలో కంటి ఆస్పత్రి, కేన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌ను నిర్మిస్తామన్నారు. ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి రూ.400 కోట్లు తెచ్చానని వెల్లడించగా... సభకు 50వేల మందిని తరలిస్తామని తెలిపారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మంలో బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభ పెట్టడం అదృష్టమని, దేశానికే దిక్సూచిగా నిలిపేలా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి మాట్లాడగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, నర్సంపేట ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు రాయల శేషగిరిరావు, నల్లమల వెంకటేశ్వరరావు, కూసంపూడి మహేష్, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఎస్.కే.రఫీ, దొడ్డా హైమావతి, పగుట్ల వెంకటేశ్వరరావు, యాగంటి శ్రీనివాసరావు, తోట సుజలరాణి పాల్గొన్నారు.

దేశం చూపు... కేసీఆర్ వైపు..

వైరా: ఈనెల 18న ఖమ్మంలో జరగనున్న బహిరంగ సభతో దేశం మొత్తం సీఎం కేసీఆర్ వైపు చూస్తోందని రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. వైరాలో జరిగిన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి 50 వేలకు తగ్గకుండా కార్యకర్తలు తరలి రావాలని సూచించారు. నాయకుడు కేసీఆర్ ఎంత ఎదిగితే పార్టీకి, కార్యకర్తలు అంత బలం పెరుగుతుందని చెప్పారు. ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్ ఇవ్వడంతో ఇటీవల భర్తీ చేసిన వైద్య పోస్టుల్లో 203 మందికి పోస్టింగ్ వచ్చిందని, 2 లక్షల పైచిలుకు ర్యాంకు సాధించిన వారికి కూడా మెడికల్ సీట్లు లభించాయన్నారు. కాగా, సమావేశానికి హాజరైన మంత్రి హరీశ్‌రావుకు వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ వినతిపత్రం అందించగా స్పందిస్తూ వైరా, కారేపల్లి పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేసేందుకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, మాజీ మంత్రి బసవరాజు సారయ్యతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు శ్రీధర్‌రెడ్డి, చంద్రావతి, మదన్‌లాల్, బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్, నల్లమల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలి



మధిర: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లత, తదితరులు



ఎర్రుపాలెం: మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

మధిర/ఎర్రుపాలెం/కల్లూరురూరల్: ఈ నెల 18నుంచి తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించనున్న కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, ఎర్రుపాలెం ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, కల్లూరు మండలం కప్పలబంధం సర్పంచ్ ప్రసాద్ తెలిపారు. మధిర మున్సిపల్ కార్యాలయంలో, ఎర్రుపాలెం రైతువేదికలో, కప్పలబంధం పంచాయతీలో కంటివెలుగు కార్యక్రమంపై శుక్రవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంటివెలుగు కార్యక్రమం ద్వారా కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్ల అద్దాలను అందజేయటం జరుగుతుందని తెలిపారు. కంటివెలుగు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కంటివెలుగు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మొండెం లలిత కుమారి, మున్సిపల్ కమీషనర్ రమాదేవి, ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ పృథ్వీ, వైద్య సిబ్బంది, తహసీల్దార్ తిరుమలాచారి, ఎంపీపీ దేవరకొండ శిరీష, జెడ్పీటీసీ శీలం కవిత, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, ఉపసర్పంచ్ మందపాటి మాధవరెడ్డి, పంచాయితీ కార్యదర్శి నవీన్‌రెడ్డి, ఏఎన్ఎం షమీనా, ఆశా కార్యకర్తలు కాటమ, సుజాత, అంగన్‌వాడీ టీచర్స్ భారతి, హెలెనా, భవాని తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి



విద్యుత్‌శాఖ డీఈఈ రాములు

సత్తుపల్లిటౌన్: సంక్రాంతి పండగ నేపథ్యంలో పిల్లలు పతంగులను ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు పాటించి పల్లిలు, పెద్దలు అందరూ పండగను సంతోషంగా నిర్వహించుకోవాలని విద్యుత్ శాఖ డీఈఈ ఎల్.రాములు అన్నారు. విద్యుత్ స్తంభాలు, తీగలులేని ప్రాంతాలను ఎంచుకొని బహిరంగ ప్రదేశాలలోనే గాలిపటాలను ఎగురవేయాలి. పిల్లలు భవనాలపై గాలిపటం ఎగురవేసేటప్పుడు పెద్దలు తప్పని సరిగా దగ్గర ఉండాలి. విద్యుత్ వైర్లకు గాలిపటాలు చుట్టుకోవటం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున భవనాలపై పతంగులు ఎగురవేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. తెగిన గాలిపటాలను అందుకునేందుకు రోడ్లపై అడ్డంగా పరిగెత్తకుండా రోడ్డుపై వస్తున్న వాహనాలను గమనించాలి. చుట్టూ గోడలు లేని భవనాలపై పతంగులు ఎగురవేయకూడదు. మాంజాను ఎక్కువగా వాడకూడదు. దీంతో చేతులు కోసుకునే ప్రమాదం ఉంది. విద్యుత్ తీగలకు చిక్కుకున్న గాలిపటాలను తీసేందుకు ఇనుపరాడ్లు, పచ్చి కర్రలతో ప్రయత్నించడం ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



ఎర్రుపాలెం: లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని తెల్లపాలెం, జమలాపురం, మీనవోలు, వెంకటాపురం గ్రామాలకు చెందిన పలువురి లబ్ధిదారులకు శుక్రవారం మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి రూ.64వేల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకటరెడ్డి, వెంకట్రావు, సొసైటీ వైస్ చైర్మన్ శ్రీనివాసరావు, నాయకులు తదితరులున్నారు.

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో లబ్ధిదారులు అడివమ్మ, పుల్లయ్యలకు మంజూరైన రూ.43,500 లు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, యాదవ సంఘం నాయకులు వీరభద్రం, బస్వయ్య, పెద్దబహ్మయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు



వైరా: విజేతలకు బహుమతులు అందిస్తున్న మున్సిపల్ కమిషనర్ అనిత



సత్తుపల్లిటౌన్: వాసవీక్లబ్ ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలు

వైరా/సత్తుపల్లిటౌన్/కొణిజర్ల/బోనకల్/పెనుబల్లి: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుని వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ చౌక్ సెంటర్‌లో, సత్తుపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో, కొణిజర్ల మండలంలో పల్లిపాడులో ఫ్రెండ్స్ యూత్ సంతూర్ వారి ఆధ్వర్యంలో, బోనకల్ మండలంలోని తూటికుంట్ల చైతన్య విద్యాలయంలో, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వియంబంజర్ లక్ష్యా స్కూల్ ఆవరణలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ అనిత, లయన్స్‌క్లబ్ పెద్దలు డాక్టర్ కాపా మురళీ కృష్ణ, చింతోజు నాగేశ్వరరావు, డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, నంబూరి మధు, మాదినేని సునిత మిట్టపల్లి వెంకటయ్య, వాసవీ క్లబ్ అధ్యక్షుడు పోకూరి కృష్ణప్రసాద్, కార్యదర్శి గుడిమెట్ల ప్రసాద్, కోశాధికారి వనమా నరేష్, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, గంగిశెట్టి జగదీష్‌కుమార్, రమేష్, వల్లీ, శారద, ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసాద్, కరస్పాండెంట్ చలసాని వైష్ణవి, వైరా మున్సిపల్ కమిషనర్ అనిత, యూత్ అధ్యక్షుడు సుధీర్, సంతూర్ డిస్ట్రిబ్యూటర్ వెంకటేష్, కరస్పాండెంట్ హుస్సేన్, కొండ ప్రేమ్‌కుమార్, ఐద్వా జిల్లా నాయకురాలు కృష్ణవేణి, సీపీఎం జిల్లా నాయకులు విఠల్‌రావు, కృష్ణార్జున్‌రావు, ఈశ్వర్, అనంత్ వినోద్ కుమార్, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి తిరుపతిరావు, నాగమణి పాల్గొన్నారు.